తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
ఆదివారం
25 అక్టోబర్ 2026
పేజీలు : 08



# నేల ఆరోగ్య పరిరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

### శాస్త్రవేత్త డాక్టర్ ఆదర్శ్




తుంగతు ర్తి అక్టోబర్ 24 (జనం సాక్షి): సమతుల్య సహజ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించి నేల ఆరోగ్య పరిరక్షణతోనే సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఆదర్శ్ అన్నారు, శనివారం మండల పరిధిలోని కొత్తగూడెం రైతువేదికలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా నేల ఆరోగ్య పరిరక్షణ, భూసార పెంపుదల, సమతుల్య ఎరువుల వినియోగం, వాతావరణ మార్పుల ప్రభావాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు, నేలలో సేంద్రియ కర్బనం శాతం పెంపొందించడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, ఉపయోగకరమైన సూక్ష్మజీవుల అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. పంట అవశేషాలను నేలలో కలపడం, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ పదార్థాల వినియోగం ద్వారా భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందించాలని తెలిపారు. నేల స్వభావం, పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులు వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని దీర్ఘకాలం పరిరక్షించుకోవచ్చని పేర్కొన్నారు,ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు యాసంగిలో ఒరి సాగు చేయవద్దని ఈ పరిస్థితిపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు, నూనె గింజలు, పప్పు ధాన్యాలు, ఉద్యాన పంటల ద్వారా వైవిధ్యాన్ని పాటించాలని అన్నారు, వరి కోత అనంతరం పంట అవశేషాలను దహనం చేయడం మానుకోవాలని అన్నారు, వ్యవసాయ అధికారి రాయపు దేవ ప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పులు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని సూచించారు. భూగర్భ జలాల తరుగుదలను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న నీటి పరిమాణానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని, మొక్కజొన్న, మినుములు, కందులు వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నీటి సంరక్షణ భూగర్భ జలాల పునరుద్ధరణ, వర్షపు నీరు సేకరణ, నేలలో తేమను సంరక్షించే పద్ధతులు పాటిస్తూ నీటి వృథాను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, వ్యవసాయ విస్తరణ అధికారి శ్వేత, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి



### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచన

రామన్నపేట, అక్టోబర్ 23 (జనంసాక్షి): గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. శుక్రవారం రామన్నపేట మండలం జనంపల్లి కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామశాఖ అధ్యక్షుడిగా నియమితులైన ఆగు సత్యనారాయణ, కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన గ్రామ కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో అందరూ కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండ సరోజా అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బండ దామోదర్ రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంగళబోడు ఆదివాసీ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



చంద్రుగొండ అక్టోబర్ 24 (జనం సాక్షి): మద్దుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని మంగళబోడు ఆదివాసీ వలస గ్రామంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.వైద్యాధికారిణి డాక్టర్ నజ్నీన్ తభస్సుమ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నిర్ణీత సమయంలో టీకాలు వేయించడం ద్వారా ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి జయలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రకాశరావు, ఆరోగ్య కార్యకర్తలు శాంతమ్మ, రాణి, ఆశా కార్యకర్త రాములమ్మ, 102 వాహన పైలట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



### రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి సమష్టిగా కృషి చేయాలి: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆత్మకూరు (ఎం), జనంసాక్షి అక్టోబర్ (23): మండల కేంద్రం లో ని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించేందుకు పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో పనిచేయాలని బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పట్టభద్రులను వ్యక్తిగతంగా కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు కోరాలని, ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించుకుని, ఎన్నికల సన్నాహక కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆయన సూచించారు.

## ఎండిపోయిన వరి పంటలకు నష్టపరిహారం చెల్లించాలి: సీపీఎం

### మోటకొండూరు మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు డిమాండ్



మోటకొండూరు, అక్టోబర్ 24(జనం సాక్షి): అప్రకటిత కరెంటు కోతలు మరియు వర్షాభావ పరిస్థితుల కారణంగా నీరందక ఎండిపోయిన వరి పంటలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, ఎకరానికి తక్షణమే రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం పార్టీ మోటకొండూరు మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం నాడు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మాటూరు పెద్దబావి గ్రామంలో రైతులు వాకిటి మల్లారెడ్డి, జిల్లారు యాదయ్య తదితరుల ఎండిపోయిన వరి పంట పొలాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కొల్లూరు ఆంజనేయులు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా విద్యుత్ కోతల ప్రభావంతో బోర్లు ఎండిపోయి వందలాది ఎకరాల్లో వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆరుగాలం కష్టపడి, అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి పొట్ట దశకు వచ్చే సమయానికి నీరు అందక చేను కళ్లముందే ఎండిపోతుండటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారని తెలిపారు. కేవలం ఏ పంట వేశారనే సర్వేలు చేస్తున్నారే తప్ప, ఎండిపోయిన పంటలను మాత్రం అధికారులు పరిశీలించడం లేదని మండిపడ్డారు.భూగర్భ జలాలు అడుగంటిపోయి సాగునీరు అందక సంక్షోభంలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, వ్యవసాయ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. రైతులకు నిండా ముంచే అప్రకటిత కరెంటు కోతలను వెంటనే అరికట్టి, నిరంతరం 18 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ మండల నాయకులు కాదూరి నరసింహ, మరియు బాధిత రైతులు వాకిటి మల్లారెడ్డి, వాకిటి అమృత, చిక్కుడు అంజయ్య, జిల్లారు యాదయ్య, మల్లయ్య, సర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థిని ప్రతిభ




ఖమ్మం (జనం సాక్షి): స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థిని వి. ప్రీతిక శ్రీ బాస్కెట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచింది. ఖమ్మం డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సిటీ లెవెల్ స్కూల్స్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్'లో పాల్గొన్న ప్రీతిక శ్రీ అద్భుతమైన ఆటతీరుతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. తన వ్యక్తిగత నైపుణ్యంతో అటు ప్రేక్షకులనే కాక, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమె ప్రతిభను గుర్తించిన అసోసియేషన్ నిర్వాహకులు మెడల్ మరియు మెరిట్ సర్టిఫికెట్‌తో ఘనంగా సత్కరించారు. పాఠశాల డైరెక్టర్లు కె. శ్రీధర్‌రావు, శ్రీమతి కృష్ణవేణి పాల్గొని ప్రీతిక శ్రీని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. "విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర సహజ సామర్థ్యాలపై దృష్టి సారించాలి. ఇప్పటికే మా విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్, సైన్స్ ఎగ్జిబిషన్లు, కరాటే వంటి పలు పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటారు" అని పేర్కొన్నారు. ఈ

# ఓటు మీది... నమోదు మా బాధ్యత

- డిజిటల్ బాటలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు
- ఖమ్మం 8వ డివిజన్‌లో వినూత్న రీతిలో ఇంటింటికీ ఫోన్ కాల్స్
- ఓటరు దగ్గరికే సర్వీస్... రశీదు నేరుగా మొబైల్‌కే
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ పిలుపుతో కదిలిన యువత



**ఖమ్మం, (జనం సాక్షి):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు అంటే సాధారణంగా దరఖాస్తు ఫారాలు పట్టుకుని తిరగడమో, లేదా కేంద్రాల వద్ద బారులు తీరడమో చూస్తుంటాం. కానీ ఖమ్మం నగర పాలక సంస్థ 8వ డివిజన్‌లో మాత్రం ఇందుకు భిన్నంగా పూర్తి ప్రణాళికాబద్ధంగా, ఆధునిక సాంకేతికతను జోడించి ఎమ్మెల్సీ ఓటరు నమోదును పండుగలా నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనలతో, స్థానిక నాయకుడు భూక్యా అశోక్ నేతృత్వంలో డివిజన్ యువత చేపట్టిన ఈ 'స్మార్ట్ డ్రైవ్' స్థానికంగా విశేష ఆదరణ పొందుతోంది.

**432 మందికి డైరెక్ట్ కాల్... క్షణాల్లో రిజిస్ట్రేషన్**

వైఎస్సార్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నమోదు కేంద్రం వేదికగా రెండో రోజూ ముమ్మరంగా కార్యక్రమం సాగింది. కేవలం కేంద్రం పెట్టి కూర్చోవడం కాకుండా, గత జాబితా ఆధారంగా గోపాలపురం, బాలపేట, ఎల్బీ నగర్ పరిధిలోని 432 మంది ఓటర్లకు కార్యకర్తలు స్వయంగా ఫోన్లు చేశారు. ఇప్పటికే నమోదు చేసుకున్న వారి వివరాలను ధ్రువీకరించుకున్నారు. ఓటు నమోదు చేసుకోని వారి నుంచి అక్కడికక్కడే అవసరమైన డాక్యుమెంట్లు తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేశారు. ప్రక్రియ ముగిసిన వెంటనే సంబంధిత ఓటర్ల వాట్సాప్/మొబైల్‌కు అక్నాలెడ్జ్‌మెంట్ రశీదులను పంపి ఓటర్లలో నమ్మకాన్ని నింపారు.

**ఇంటి ముంగిటకే అప్లికేషన్... స్పందించని వారికీ స్పెషల్ ట్రాకింగ్**

ఫోన్లలో అందుబాటులో లేనివారిని, ఇళ్ల వద్ద ఉన్న వారిని యువకులు స్వయంగా కలిసి దరఖాస్తులు సేకరించారు. కాల్స్‌కు స్పందించని వారి పేర్లను ప్రత్యేక జాబితాగా రూపొందించి, ఎవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా పకడ్బందీ ఫాలో-అప్ చేస్తున్నారు.

**నవంబర్ 6 వరకు ఇదే స్పీడ్:**

భూక్యా అశోక్ "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడమే కాకుండా, విద్యావంతులు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకం. నవంబర్ 6వ తేదీ వరకు అర్హులైన ప్రతి ఒక్కరినీ వెతికి మరీ ఓటరుగా నమోదు చేయిస్తాం" అని భూక్యా అశోక్ స్పష్టం చేశారు. స్థానిక యువత ఉత్సాహంగా పాలుపంచుకోవడంతో డివిజన్‌లో ఓటరు నమోదు కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది.

# రఘునాధగూడెం గ్రామంలో రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సబ్ కలెక్టర్



కల్లూరు అక్టోబర్ 24(జనం సాక్షి): కల్లూరు మండలంలోని రఘునాధగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం భౌగోళిక విస్తీర్ణం 1,167 ఎకరాల గుంటలు కాగా, ఇప్పటివరకు సుమారు 800 ఎకరాల భూమికి సర్వే పనులు పూర్తయ్యాయని సంబంధిత సర్వే బృందం అధికారులు సబ్ కలెక్టర్ కి వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సర్వే పనుల పురోగతిని సమీక్షించి, సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. రీ-సర్వే ప్రక్రియలో భూముల హద్దులను క్షేత్రస్థాయిలో కచ్చితంగా గుర్తించడం, భూ రికార్డుల్లో వివరాలను సక్రమంగా నమోదు చేయడం, పారదర్శకతతో సర్వే పనులను నిర్వహించడం వంటి అంశాలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే, రీ-సర్వే ద్వారా భూ రికార్డులను మరింత స్పష్టంగా, ఖచ్చితంగా రూపొందించవచ్చుని, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను తగ్గించేందుకు ఈ ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. గ్రామస్థులతో సబ్ కలెక్టర్ నేరుగా మాట్లాడి, రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సర్వే సమయంలో రైతులు, భూయజమానులు సర్వే బృందానికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే బృందం సభ్యులు , రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి పంటలను అసలే వెయ్యవద్దు



కనగల్లు, అక్టోబర్ 24 (జనం సాక్షి): యాసంగిలో ఆరుతడి పంటలు వేయడం వీలు కాకపోతే భూమిని ఖాళీగా ఉంచుకోండి కానీ వరి పంటలు మాత్రం వేయవద్దని వరి వేసిన రైతు లు తీవ్రంగా నష్టం పోతారని మండల వ్యవసాయ అధికారి బెజవాడ అమరేందర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ధర్వేశిపురం గ్రామంలో సాగుభూమి సంరక్షణ , యాసంగిలో వరి పంటలు వద్దు, ఆరుతడి పంటలే వెయ్యాలి అనేఅవగాహన కార్యక్రమాన్ని రైతులతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ అమరేందర్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులు దుష్ట భూగర్భ జలాలు తగ్గిపోయి, కరెంటు సరఫరా లో తీవ్ర అంతరాయం ఉండే అవకాశం ఉన్నందున రైతులు విపత్కర పరిస్థితులను అర్థం చేసుకొని యాసంగిలో వరి పంట వేయకుండా ఆరుతడి పంటలు వేరుశెనగ, పప్పు ధాన్యాలు లాంటి తక్కువ నీరు అవసరం పడే పంటలనే రైతులు వేసుకొని తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. వరి కొయ్యలను తగలపెట్టవద్దని, భూసారని సంరక్షించుకోవాలని కోరారు. ముఖ్యంగా పంట మార్పిడి పద్ధతులను రైతులు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాయల శేఖర్, ఏ ఈ ఓ మౌనిక, పంచాయతీ కార్యదర్శి దేవి రెడ్డి పద్మ రైతులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- ఆశ వర్కర్లకు అంగనవాడి ఆయలు
- కనీస వేతనం 26 వేల రూపాయలను ఇవ్వాలి
- సిఐటియు మండల కన్వీనర్ బాదవత్ శ్రీను ప్రభుత్వానికి డిమాండ్



**కామేపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మధ్యాహ్న భోజన వర్కర్ల అంగన్వాడి ఆయలు ఆశ వర్కర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ శనివారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో కామేపల్లి మెడికల్ ఆఫీసర్ మండల విద్యాశాఖ అధికారి కి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వర్కర్ల పట్ల సవతి తల్లి ప్రేమ తో చిన్నచూపు చూడడం తగదని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించుకుంటే అవి పరిష్కారం అయ్యేవరకు దశలవారీగా ఆందోళన చేస్తూ. ఉద్యమిస్తామని అందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 తేదీన హైదరాబాదు ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా ను జయప్రదం చేయాలని వివిధ శాఖలలో పనిచేస్తున్న వర్కర్లను కోరారు. ఈ కార్యక్రమం లో మధ్యాహ్న భోజన వర్కర్స్ అంగన్వాడి ఆయలు ఆశ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి లింగం జయమ్మ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరిలో మిషన్ భగీరథ పైపులైన్ పనులు పూర్తి



- తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు..
- సీసీ రోడ్డు పనులు కూడా పూర్తి

**తిరుమలగిరి (సాగర్), అక్టోబర్ 24 (జనంసాక్షి):** తిరుమలగిరి గ్రామంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన మిషన్ భగీరథ పనులు పూర్తయ్యాయి . గ్రామంలోని హైస్కూల్ వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్ నుంచి మిషన్ భగీరథకు సంబంధించిన పైపులైన్ పనులను పూర్తి చేశారు. పైపులైన్ ఏర్పాటుకు తవ్విన ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా చేపట్టి పూర్తి చేస్తున్నారు. ఈ పనులను గ్రామ సర్పంచ్ పగడాల పున్నమ్మ సైదులు యాదవ్, ఉపసర్పంచ్ ఇరిగి తిరుపతమ్మ శ్రీను, వార్డు సభ్యులు పసుపులేటి కృష్ణ, సత్రసాల వెంకటయ్య, పాలకవర్గ సభ్యులు తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుకు ఉచిత కేంద్రం



**చింతల పాలెం (జనంసాక్షి):** నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చింతలపాలెం మండల కేంద్రంలో ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. అక్టోబర్ 25 ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు ఎస్బిఐ బ్యాంకు పక్కన ఉన్న రారాజు డిజిటల్ కమ్యూనికేషన్స్ వద్ద ఉచిత ఓటరు నమోదు కేంద్రం ప్రారంభమవు తుందని తెలిపారు. అర్హులైన పట్టభద్రు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, 2026 నవంబర్ 6 వ తేదీ లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఇంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి



**వాణిజ్య సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలి: మున్సిపల్ కమిషనర్**

**మధిర, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మధిర మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేయడంతో పాటు, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె. సామ్యూల్ పాల్ అధికారులను ఆదేశించారు. శనివారం మధిర మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్ ఈ. ఉదయ్ కుమార్, వార్డు ఆఫీసర్లతో కమిషనర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్లు, ట్రేడ్ లైసెన్సులు, పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

**ఆస్తి పన్ను నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి**

ఆస్తి పన్ను బకాయిలు ఉన్నవారు మార్చి నెల వరకు సమయం ఉందని భావించి చెల్లింపుల్లో జాప్యం చేయరాదని కమిషనర్ స్పష్టం చేశారు. బకాయిదారులను గుర్తించి, వారు వెంటనే పన్నులు చెల్లించేలా వార్డు ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, నీటి పన్ను బకాయిలను కూడా గుర్తించి, వాటి వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు.

**బకాయిదారులకు నోటీసులు**

ఆస్తి పన్ను, నీటి పన్ను చెల్లించని బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, నోటీసులకు స్పందించకుండా బకాయిలు చెల్లించని వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ పన్నులను సకాలంలో చెల్లించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

**వాణిజ్య సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలి**

మున్సిపాలిటీ పరిధిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాణిజ్య సంస్థలు నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్సులు పొందడంతో పాటు, సంబంధిత లైసెన్స్ ఫీజులను సకాలంలో చెల్లించాలని , లైసెన్సులు లేని వ్యాపార సంస్థలను గుర్తించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాణిజ్య భవనాలకు సంబంధించిన ఆస్తి పన్ను, నీటి పన్ను బకాయిలను కూడా సమీక్షించి, వాటి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

**పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ**

పట్టణంలో పారిశుద్ధ్య పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. శానిటేషన్ బాధ్యతలు నిర్వహించే వార్డు ఆఫీసర్లు ప్రతిరోజూ ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటించి, పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా నిరంతరం చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మున్సిపల్ మేనేజర్ ఈ. ఉదయ్ కుమార్, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం.. ఎమ్మెల్యే బత్తుల

**పోలీస్ అమర వీరులదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే**

**మిర్యాలగూడ, (జనంసాక్షి):** రక్తదానం ప్రాణదానం తో సమానమని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం నాడు మిర్యాలగూడ డిఎస్పీ కార్యాలయం లో డి ఎస్పీ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిధిగా పాల్గొని ఎమ్మెల్సీ శంకరనాయక్ తో కలిసి ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ ఇలాంటి రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. రక్తదానం ప్రాణ దానం తో సమానమని ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సమాజం లో మానవత్వాన్ని, సేవభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన పోలీస్ లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, డివిజన్ పరిధిలోని సీఐ లు నాగభూషణరావు, సోమనర్సయ్య, పి ఎన్ డి ప్రసాద్, డివిజన్ పరిధిలోని ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చాడ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పోలీస్ స్మారక దినోత్సవ వేడుకలు

- **విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**
- **గ్రామస్థులతో అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్సై కుమారస్వామి యాదవ్**



**మోటకొండూరు, అక్టోబర్ 24 (జనం సాక్షి):** పోలీస్ స్మారక దినోత్సవ వేడుకల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల పరిధిలోని చాడ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మోటకొండూరు మండల ఎస్సై కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టడం జరిగింది.ఈ వేడుకల్లో భాగంగా చాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రెండు ముఖ్యాంశాలపై 1) సైబర్ నేరాల నివారణ,2) మాదక ద్రవ్యాల నివారణ పై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. సైబర్ నేరాల నివారణ: అంతర్జాలం ద్వారా జరుగుతున్న మోసాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరగాళ్లు చేసే మోసాల పట్ల విద్యార్థులు మరియు ప్రజలు ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలనే దానిపై అవగాహన కల్పించారు.యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండటానికి, డ్రగ్స్ వలన వ్యక్తిగత జీవితం మరియు సమాజంపై పడే తీవ్ర దుష్ప్రభావాల గురించి వివరించారు.



**యువకులతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు**

ఈ పోటీల అనంతరం చాడ గ్రామంలో గ్రామస్తులు మరియు యువకులతో కలిసి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల కట్టడికి ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని ఎస్సై కుమారస్వామి యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు**

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు పట్టభద్రులందరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి పలువురు పట్టభద్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. 2023 లోపు సంవత్సరం డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరు ఓటు కోసం నమోదు చేసుకోవాలని సమయం తక్కువగా ఉన్నందునా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బచ్చనబోయిన శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు బొడ్డుపల్లి నిరంజన్, షేక్ జహంగీర్, జింక పెద్దిరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ వర్రాల సత్యనారాయణ, షేక్ చాంద్ పాషా, షేక్ ఫయాజ్, విజయ్, శ్రీశైలం పాల్గొన్నారు.



# భూ కబ్జాలపై బీజేపీ పోరాటం

- అధికారుల సస్పెన్షన్ ప్రజా విజయం
- బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్

**హుజూర్‌నగర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** హుజూర్‌నగర్ పట్టణంలో దేవాదాయ, ప్రభుత్వ, సీలింగ్, ఎన్ఎస్పీ కెనాల్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు, కబ్జాలపై బీజేపీ అలుపెరగని పోరాటం చేసిందని హుజూర్ నగర్ బీజేపీ పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అన్నారు. శనివారం పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పోరాటం ఫలితంగానే ప్రభుత్వం స్పందించి ఎమ్మార్వో, ఆర్ఐ, జీపీఓలను సస్పెండ్ చేసిందని, ఇది ప్రజా విజయమని పేర్కొన్నారు. పేదల భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడటమే లక్ష్యమని, సస్పెన్షన్ తో సమస్య తీరదని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆక్రమణలన్నీ స్థానిక మంత్రి, అధికార పార్టీ నాయకుల అండదండలతోనే జరిగాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ తో పాటు జిల్లా నాయకులు బెల్లంకొండ నరేష్ గౌడ్, జిల్లా లీగల్ సెల్ నాయకులు పిడమర్తి చంద్రయ్య, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి కంటు నాగరాజు, ప్రధాన కార్యదర్శులు గుండా గోపి, రాళ్లబండి రామారావు, మేళ్లచెరువు లక్ష్మణ్, సోమగాని ప్రదీప్, కొప్పెర సాయిరాం, సతీ బల్వంత్ సింగ్, శ్రవణ్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు.ఉల్లాస్ అమ్మకు అక్షరమాల

## మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి

**నేరేడుచర్ల అక్టోబర్ 24 (జనంసాక్షి).** పురపాలక సంఘ పరిధిలోని నిరక్షరాస్యులకు అక్షరాస్యతను అందించాలనే లక్ష్యంతో "ఉల్లాస్ అమ్మకు అక్షరమాల" కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకట రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులకు చదవడం,రాయడం వంటి ప్రాథమిక విద్యా నైపుణ్యాలను అందించి, వారిలో విద్య పట్ల అవగాహన పెంపొందించడం,సంపూర్ణ అక్షరాస్యత సాధించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలియజేశారు.ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారి,తమ దైనందిన జీవితంలో విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అక్షరాస్యత ప్రాధాన్యతను వివరించి, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, డిఎమ్సి రమేష్ నాయక్, టిఎమ్సి శ్వేత, మాజీ కౌన్సిలర్ రణపంగ నాగయ్య, టిఎల్ఎఫ్ ఆర్పి సరిత, ఆర్పి లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# 15 కరెంట్ కోతలతో రైతుల కంట కన్నీరు.!

- పంటలు ఎండిపోతున్నా పట్టించుకోరా? నష్టపరిహారం వెంటనే అందించాలి
- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- అంగడిపేట సబ్‌స్టేషన్ ముట్టడిలో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**పి.ఏ.పల్లి, అక్టోబర్ 24( జనంసాక్షి):** విద్యుత్ కోతలతో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు.రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని,విద్యుత్ కోతలతో నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకుని నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. శనివారం పి.ఏ.పల్లి మండలం అంగడిపేట సబ్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు,రైతులు చేపట్టిన ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

### రైతుల పరిస్థితి దయనీయం

వ్యవసాయంపై ఆధారపడిన నల్గొండ జిల్లాలో విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రవీంద్ర కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వడంతో వలస వెళ్లిన అనేక మంది తిరిగి వచ్చి సాగు చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతుండటంతో రైతులు మళ్లీ వలసబాట పట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు.

కాలువల్లో నీరు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు.వరి సాగు కోసం ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి అప్పులు చేసిన రైతులు,పంటలు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి,బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

### విద్యుత్ ఉత్పత్తి పెరిగినా కోతలెందుకు?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సుమారు 7,000 మెగావాట్ల స్థాయి నుంచి 20,000 మెగావాట్లకు పైగా పెంచామని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.రాష్ట్ర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాద్రి,యాదాద్రి వంటి విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టామని గుర్తుచేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని, రాష్ట్రంలో కరెంట్ కోతలకు అసలు కారణమేంటో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### కాలిపోయిన మోటార్లు,ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే బాగు చేయాలి

విద్యుత్ కోతలకు తోడు మోటార్లు,ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని కోరారు.గ్రామాల్లో పశువులు,మేకలకు తాగునీరు అందని పరిస్థితులు నెలకొంటున్నాయని,కొన్ని చోట్ల ప్రజలు సైతం తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఎరువుల కొరతపై చర్యలేవి?

రాష్ట్రంలో ఎరువుల కొరత కారణంగా రైతులు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని రవీంద్ర కుమార్ ఆరోపించారు.నకిలీ డీఏపీ ఎరువుల సరఫరాపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నకిలీ విత్తనాలు,ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు.

### సాగునీటి సమస్యలను పరిష్కరించాలి

జూరాల పరిధిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ నల్గొండ జిల్లా రైతులకు సాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నీరు వెళ్తున్నప్పటికీ ఇక్కడి రైతులకు సాగునీరు అందకపోవడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.రెండో పంట వేయవద్దని చెబుతున్న ప్రభుత్వం,ఇప్పటికే ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ప్రకటించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలపై స్పందించి విద్యుత్ కోతలను నివారించాలని, సాగునీటి సదుపాయాలను మెరుగుపరచాలని, కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయించాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి వారిని ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పి.ఏ.పల్లి మండల అధ్యక్షుడు యెల్గూరి వల్లపు రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్,రేటినేని ముత్యపు రావు,కటికనేని మాధవరావు,సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,రాయనబోయిన శ్రీను,ఆదెపు నగేష్, దూదిపాల అశ్విని రాజేందర్ రెడ్డి,రమావత్ కిషన్, హన్మ నాయక్,అర్వపల్లి నర్సింహ,తోటకూరి పరమేష్, బొడ్డుపల్లి మహేందర్,మాద సుధాకర్ గౌడ్,వంగాల కృష్ణారెడ్డి,గోలి గిరి,ఎర్ర యాదగిరి,దేపావత్ నరేందర్, రమావత్ శ్రీను,విష్ణువర్ధన్ రెడ్డి,లోకేష్,రమావత్ దామోదర్, గిరి,వెంకటేష్, అనిల్,శివ తదితరులు పాల్గొన్నారు.

# దళితుల బాటపై అధికారిక కబ్జా?.. ఇందుగులలో కదం తొక్కిన గ్రామస్తులు!

- 50 కుటుంబాలకు 20 ఏళ్ల దారిని బంద్ చేసిన ఆక్రమణదారులు
- బేఖాతరు చేస్తున్న యంత్రాంగం కబ్జాకోరులు, అక్రమ రిజిస్ట్రేషన్ అధికారులపై చర్యలకు డిమాండ్
- బాట వద్దే టెంట్లు వేసి గ్రామస్తుల ఉద్యమం



**మాడుగులపల్లి, అక్టోబర్ 24 ( జనం సాక్షి):** నిరుపేద దళితుల హక్కులపై ఆక్రమణదారుల కన్ను పడింది దశాబ్దాలుగా నమ్ముకున్న రాకపోకల దారిని కబ్జా కోరులు బంద్ చేసి దౌర్జన్యానికి దిగితే, దానికి వత్తాసు పలుకుతూ రెవెన్యూ అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్లు కట్టబెట్టడంపై ఇందుగుల గ్రామంలో తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో దళితులకు కనీస రాకపోకల బాట కూడా లేకుండా ఆక్రమించుకున్న వారిపై, వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు గ్రామంలోని దళితవాడకు వెళ్లే ప్రధాన బాట వద్దే టెంట్లు వేసి గ్రామస్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా దాదాపు 50 దళిత కుటుంబాలు ఈ బాట ద్వారానే రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు అంతటి సుదీర్ఘ చరిత్ర ఉన్న ప్రజా బాటను అక్రమంగా కబ్జా చేసి, తమను దారి లేని బాధితులుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా రాలేని దుస్థితికి నెట్టివేశారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని బాధితులు ప్రశ్నించారు బాటగా ఉన్న భూమిని అక్రమంగా వేరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేసిన బాధ్యతా రాహిత్య అధికారులపై తక్షణమే శాఖాపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు దళితుల హక్కులను కాలరాస్తున్న కబ్జాదారులపై, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వెంటనే తమ పాత బాటను పునరుద్ధరించాలని హెచ్చరించారు లేనిపక్షంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# పచ్చదనంపై ప్రతాపం పర్మిషన్లు గాలికి!

- మాడుగులపల్లిలో యథేచ్ఛగా భారీ చెట్ల నరికివేత
- వ్యవసాయ కార్యాలయం ఎదుటే కూలుతున్న వృక్షాలు.. స్పందించని యంత్రాంగం
- అసలు ఫారెస్ట్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిద్రపోతున్నారా?



**మాడుగులపల్లి, అక్టోబర్ 24 (జనం సాక్షి):** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో పచ్చని చెట్లను అక్రమంగా నరికివేస్తున్నా బాధ్యతాయుతమైన అధికారులు మాత్రం కుంభకర్ణ నిద్రలో జోగుతున్నారు ప్రభుత్వాలు హరితహారం పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాగుతుంటే మరోవైపు అందినకాడికి దండుకుంటూ ఏళ్ల తరబడి పెరిగిన పెద్ద పెద్ద మహావృక్షాలను నేలమట్టం చేస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం ఎదుట, మాడుగులపల్లి నుండి ఇందుగుల వెళ్లే ప్రధాన రహదారి పక్కన జరుగుతున్న ఈ తతంగం అధికారుల పనితీరుకు నిదర్శనంగా మారింది

**చట్టాలు చుట్టాలట.. అధికారుల మౌనం దేనికి సంకేతం?**

రోడ్డు పక్కన ఉన్న చెట్లను నరకాలంటే రెవెన్యూ, ఫారెస్ట్, పంచాయతీ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరి కానీ ఇవేం పట్టించుకోకుండా ఇష్టానుసారంగా యంత్రాలతో చెట్లను కోసేస్తున్నా రోజూ అదే రోడ్డుపై రాకపోకలు సాగించే అధికారులకు ఈ దృశ్యాలు కంటపడడం లేదా? లేక అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ నరికివేత బహిరంగంగా జరుగుతుందా? అన్నదానికి ఎవరూ సమాధానం చెప్పడం లేదు మండల కేంద్రంలోనే అధికారుల కళ్ల ముందే ఇంత జరుగుతుంటే ఇక మారుమూల గ్రామాలు, తండాలలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

**విలేకరి విచారిస్తే వింత సమాధానాలు!**

ఈ దారుణాన్ని గమనించిన స్థానిక జనం సాక్షి విలేకరి వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి ఎవరి అనుమతితో ఈ చెట్లు నరుకుతున్నారు?అని ప్రశ్నిస్తే వారి నుంచి వచ్చిన సమాధానం విస్తుగొలిపింది. మాకు ఒక పెద్ద అధికారి చెప్పారు, అందుకే కొడుతున్నాం అని బదులిచ్చారు. ఆ అధికారి పేరేంటని నిలదీస్తే మాకు ఆ అధికార పేరు తెలియదు అంటూ నీళ్లు నమలడం చూస్తే తెరవెనుక ఎంత పెద్ద మాఫియా నడుస్తోందో ఇట్టే అర్థమవుతోంది.

**ఫారెస్ట్, మండల అధికారులకు సోయి లేదా?**

అసలు మాడుగులపల్లి మండలంల నికి ఫారెస్ట్ అధికారులు ఉన్నారా? లేక వారు కూడా ఈ అక్రమ దందాతో చేతులు కలిపారా? మండల అభివృద్ధి అధికారులు కార్యాలయాలకు ఈ విషయం తెలియదా? లేక ఏమీ తెలియనట్లు మొద్దునిద్ర నటిస్తున్నారా? పచ్చని చెట్లను కాపాడాల్సిన బాధ్యత గల అధికారులే ఇలాంటి అరాచకాలను చూసీచూడనట్లు వదిలేస్తే

**భవిష్యత్తులో పర్యావరణం ఏమైపోవాలి?**

ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మాడుగులపల్లిలో అనధికారికంగా చెట్లు నరుకుతున్న వారిపై, వారికి అండగా నిలుస్తున్న ఆయా శాఖల అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాసంఘాలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నాయి లేనియెడల ప్రజాక్షేత్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నాయి వివరణ కోసం ఫారెస్ట్ అధికారికి ఫోన్ చేయగా పర్మిషన్ ఎటువంటిది లేదు ఆ అక్రమంగా కొడుతున్నారని తెలియజేశారు.

## అన్నదానం మహాదానం



సూర్యాపేట (జనంసాక్షి):ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర మహాసభ ఈసీ మెంబర్, సుధా బ్యాంకు వైస్ చైర్మన్, లయన్స్ ఐ హాస్పిటల్ వైస్ చైర్మన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సూర్యాపేట టౌన్ ఉపాధ్యక్షులు కక్కిరేణి చంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా సూర్యాపేట కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ కింద టీంఎంఎన్ఎల్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో అందరితో సన్నిహితంగా ఉండే నాయకులు, తమకు అత్యంత ఆప్తులైన కక్కిరేణి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.సూర్యాపేట పట్టణంలో టీంఎమ్ఎన్ఎల్ ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి పేదలకు అన్నదానం చేయడం హర్షనీయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్, గుణగంటి సతీష్ , జూలకంటి నాగరాజు, యామ సంతోష్ , శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పంట నిల్వకు భరోసా

**పాత సూర్యాపేటలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్య గోదాముకు శంకుస్థాపన**



**సూర్యాపేట, (జనంసాక్షి) :** రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ ఉంచుకునేందుకు ప్రజా ప్రభుత్వం గోదాముల నిర్మాణం చేపడుతూ రైతన్నకు అండగా నిలుస్తోందని ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.శనివారం ఆత్మకూర్ (ఎస్) మండలం పాత సూర్యాపేట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రైతులకు ఉపయోగపడేలా భారీ సామర్థ్యంతో గోదాము నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు.రైతులు పండించిన ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు సరైన వసతులు లేక రహదారులపై ఆరబెట్టాల్సి వస్తోందన్నారు.అకాల వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తే పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిల్వ సదుపాయాలను విస్తరిస్తున్నట్లు తెలిపారు.గిడ్డంగుల సంస్థ అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పని చేసి నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్,గ్రామ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది,ఆత్మకూర్ (ఎస్ ) మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు రామచంద్రారెడ్డి,సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి,చివ్వెంల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండి రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పచ్చిపాల వెంకన్న, శ్రీదండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి పురుషోత్తం నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భూతరాజు రామయ్య 45వ వర్ధంతి వేడుకలు

**ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని దానం చేసిన మహానీయుడు చిరస్మరణీయం**

**చందూరు, అక్టోబర్ 24 (జనంసాక్షి):** సమాజహితం కోసం ప్రాణత్యాగం చేయడమే కాకుండా, తనకున్న విలువైన ఆస్తులను ప్రజాప్రయోజనాల కోసం దారాదత్తం చేసిన మహనీయుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని, అటువంటి కోవకే చెందిన గొప్ప మానవతావాది శ్రీ భూతరాజు రామయ్య అని వక్తలు కొనియాడారు. చందూరు ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అప్పట్లోనే ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రెండు ఎకరాల విశాలమైన భూమిని దానం చేసి ఆదర్శప్రాయంగా నిలిచిన దాత, మహానీయులు శ్రీ భూతరాజు రామయ్య 45వ వర్ధంతి వేడుకలు శనివారం చందూరులో అత్యంత ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా రామయ్య కుటుంబ సభ్యులు, స్థానికులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. నాటి ఆయన



దాతృత్వాన్ని, విశిష్ట సేవలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. నాటి త్యాగమే నేడు ప్రజలకు శ్రీరామరక్ష..ఈ కార్యక్రమంలో చందూరు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ మాసరాజు ముఖ్య అతిథిగా పాల్గొని రామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూతరాజు రామయ్య నాటిన దాతృత్వపు బీజం నేడు వృక్షమై వేలాది మందికి ప్రాణాలు రక్షిస్తోందని ప్రశంసించారు. రామయ్య దానం చేసిన ఆ రెండు ఎకరాల స్థలంలో రూపుదిద్దుకున్న ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా నేటికీ చందూరు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ఆసుపత్రికి ఆయన చేసిన త్యాగమే మూలస్తంభంగా నిలిచిందని కొనియాడారు. ఆసుపత్రి సిబ్బంది కూడా రామయ్య సేవాభావాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఘనంగా నివాళు లర్పించిన ప్రముఖులు.. ఈ శ్రద్ధాంజలి కార్యక్రమంలో భూతరాజు రామయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు , స్థానిక ప్రముఖులు పెద్దఎత్తున తరలివచ్చి ఘన నివాళులు అర్పించారు. భూతరాజు వెంకటేశం, యాదయ్య నారాయణ, భూతరాజు స్రవంతి రమేష్, మురళి, వేణు,రామకృష్ణ మణికంఠ, భూతరాజు హేహన్స్, పగిళ్ళ స్రవంతి, రెవల్లి వెంకటేష్, కొమ్మనపల్లి దశరథ తదితరులు పాల్గొన్నారు. రామయ్య ఆశయాలను ఆయన చేసిన త్యాగాన్ని భవిష్యత్ తరాలకు గుర్తుచేస్తూనే ఉంటామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

# మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- ఆశ వర్కర్లకు అంగనవాడి ఆయలు
- కనీస వేతనం 26 వేల రూపాయలను ఇవ్వాలి
- సిఐటియు మండల కన్వీనర్ బాదవత్ శ్రీను ప్రభుత్వానికి డిమాండ్



**కామేపల్లి,అక్టోబర్ 24 (జనంసాక్షి):** మధ్యాహ్న భోజన వర్కర్ల అంగన్వాడి ఆయలు ఆశ వర్కర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ శనివారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో కామేపల్లి మెడికల్ ఆఫీసర్ మండల విద్యాశాఖ అధికారి కి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వర్కర్ల పట్ల సవతి తల్లి ప్రేమ తో చిన్నచూపు చూడడం తగదని అన్నారు.తమ సమస్యలు పరిష్కరించుకుంటే అవి పరిష్కారం అయ్యేవరకు దశలవారీగా ఆందోళన చేస్తూ.ఉద్యమిస్తామని అందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.ఈనెల 26 తేదీన హైదరాబాదు ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా ను జయప్రదం చేయాలని వివిధ శాఖలలో పనిచేస్తున్న వర్కర్లను కోరారు.ఈ కార్యక్రమం లో మధ్యాహ్న భోజన వర్కర్స్ అంగన్వాడి ఆయలు ఆశ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి లింగం జయమ్మ, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

- సీపీఐ(ఎం) హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు
- ఖానాపురం హవేలీలో ఎమ్మెల్సీ ఉచిత ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం

**ఖమ్మం, (జనంసాక్షి):** రాబోయే పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఓటరు నమోదు సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఖానాపురం హవేలీలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ఉచిత ఓటర్ నమోదు కేంద్రాన్ని' హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్డీ జావిద్, కేవీ నవీన్, కొల్లి ప్రదీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి
- రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**పి.ఏ.పల్లి అక్టోబర్ 24 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. శనివారం పి.ఏ.పల్లి మండలం అంగడిపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నేనావత్ తండా,పోతిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం విద్యుత్ కోతలు, తక్కువ వోల్టేజీ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాల అమలులోనూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సూచించారు.

యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఎరువుల కొరతతో పాటు డీఏపీ ధరల భారం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటార్లను పూర్తిస్థాయిలో నడిపించాలని, ఏఎంఆర్, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

### విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల చేయకపోవడంతో వారి చదువులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని రవీంద్ర కుమార్ అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు సమాధానం చెప్పాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి సహా సంక్షేమ పథకాల అమలులో జాప్యాన్ని నివారించాలని కోరారు.

### ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్, కంటి వెలుగు, కేసీఆర్ కిట్ వంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం చేకూరిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, హామీల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిలదీయాలని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని రమావత్ రవీంద్ర కుమార్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యెల్గురి వల్లపు రెడ్డి,రేటినేని ముత్యపు రావు, కటికనేని మాధవరావు,సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,రాయనబోయిన శ్రీను,ఆడెపు నగేష్, దూదిపాల అశ్విని రాజేందర్ రెడ్డి,రమావత్ కిషన్, హన్మ నాయక్, బొడ్డుపల్లి మహేందర్, మాద సుధాకర్ గౌడ్, గోలి గిరి,అర్వపల్లి నర్సింహా,ఎర్ర యాదగిరి,దామోదర్,అనిల్,శివ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేట పట్టణంలోని 33వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత ఆ వార్డు కౌన్సిలర్ నాగుల వాసుతో కలిసి శనివారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,పటేల్ రమేష్ రెడ్డి సహకారంతో సూర్యాపేట పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టణంలో మరింత అభివృద్ధి సాధించే దిశగా ముందుకు సాగుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.



## శ్రీశ్రీశ్రీ సరళమైసమ్మ దేవాలయం వద్ద కుమ్మర్లకు హక్కులు కల్పించాలి



### తహసీల్దార్ కార్యాలయం ఎదుట స్థానిక కుమ్మర్ల ధర్నా

**సంస్థాన్ నారాయణపురం: అక్టోబర్ 24. ( జనం సాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. నారాయణపురం రెవెన్యూ పరిధిలో ఉన్న శ్రీశ్రీశ్రీ సరళమైసమ్మ దేవాలయం వద్ద స్థానిక కుమ్మర్లకు సంప్రదాయబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కుమ్మర సంఘం నాయకులు మాట్లాడుతూ, నారాయణపురం రెవెన్యూ పరిధిలో ఉన్న శ్రీశ్రీశ్రీ సరళమైసమ్మ దేవాలయంతో పాటు గ్రామదేవతల వద్ద స్థానిక కుమ్మర్ల సంప్రదాయ సేవలను గుర్తించి, వారికి తగిన హక్కులు కల్పించాలని ప్రభుత్వ అధికారులను కోరారు.

గ్రామదేవతల వద్ద పూజారులుగా స్థానిక కుమ్మర్లకు గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, కుమ్మర్లపై అల్లాపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చేసిన దాడులను వారు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కుమ్మరి కులస్తులు, సంఘం నాయకులు, కులపెద్దలు తదితరులు పాల్గొని తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని తెలిపారు.

## వలస కూలీకి అండగా 'అన్నం ఫౌండేషన్'

### నేత్రదానం చేయించి, గౌరవప్రదంగా అంత్యక్రియలు

**ఖమ్మం, (జనంసాక్షి) :** పొట్టకూటి కోసం స్వరాష్ట్రం విడిచి వలస వచ్చిన ఓ నిరుపేద కుటుంబానికి 'అన్నం ఫౌండేషన్' కొండంత అండగా నిలిచింది. అనారోగ్యంతో మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి దహన సంస్కారాలు చేసే స్థోమత కూడా లేకపోవడంతో, మానవత్వంతో స్పందించి అంత్యక్రియలు పూర్తి చేయడమే కాకుండా నేత్రదానం చేయించి ఆదర్శంగా నిలిచింది. ఒడిశా రాష్ట్రం, నవరంగపూర్ జిల్లా, జోల గ్రామానికి చెందిన లక్కీదర్ మతియా (45) కుటుంబంతో కలిసి జీవనోపాధి నిమిత్తం ఖమ్మం ప్రాంతానికి వలస వచ్చారు. మద్యానికి బానిసైన ఆయన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన గత రాత్రి మృతిచెందారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లడానికి గానీ, స్థానికంగా అంత్యక్రియలు నిర్వహించడానికి గానీ ఆర్థిక స్తోమత లేక దిక్కుతోచని స్థితిలో మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయాన్ని గమనించిన ఆసుపత్రి సిబ్బంది వెంటనే 'అన్నం ఫౌండేషన్'కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అన్నం ఫౌండేషన్ చైర్మన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు అన్నం శ్రీనివాసరావు వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, మరణానంతరం కూడా మరొకరికి చూపునిచ్చేలా నేత్రదానం గొప్పతనాన్ని వివరించి వారిని ఒప్పించారు. అనంతరం మృతదేహం నుంచి నేత్రదానం చేయించారు. అక్కడి నుంచి మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ వాహనంలో తరలించి నూతన వస్త్రాలు, పూలమాలలతో గౌరవించారు. మృతుడి భార్య జయ మతియా, కుమార్తె తులసి మతియా, అల్లుడు ధర్మ సమక్షంలో బల్లేపల్లి వైకుంఠ ధామానికి తీసుకెళ్లి శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు పూర్తి చేశారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించిన అన్నం శ్రీనివాసరావుకు, ఫౌండేషన్ ప్రతినిధులకు మృతుడి కుటుంబ సభ్యులు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు.



# ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి

- **డ్రిప్, బోరు నీటి వసతి ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలి**
- **జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్**
- **వైరా డివిజన్ ఉద్యాన అధికారి ఆకుల వేణు రైతులకు సూచన**

కామేపల్లి,అక్టోబర్ 24 (జనంసాక్షి): ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్, వైరా డివిజన్ ఉద్యాన అధికారి ఆకుల వేణు సూచించారు. మండలంలోని గోవింద్రాల, పొన్నెకల్లు గ్రామాల్లో వారు మిరప,కూరగాయల తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు.డ్రిప్(బిందు సేద్యం)బోరు నీటి వసతి ఉన్న రైతులు నీటి లభ్యత, నేల స్వభావం,సాగు ఖర్చులను పరిగణనలోకి తీసుకొని కూరగాయలు, పండ్లు,పూల తోటలు, ఆయిల్‌పామ్ వంటి ఉద్యాన పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.బిందు సేద్యం ద్వారా నీటిని మొక్కల వేర్లకు నేరుగా అందించి నీటి వృథాను తగ్గించవచ్చని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక,నీటి యాజమాన్య పద్ధతులపై రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.ఉద్యాన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించి ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్షేత్ర పర్యటనలో డ్రిప్ కంపెనీ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించండి

- **జిల్లా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్,**
- **కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు**



కామేపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి): వరంగల్ -నల్గొండ- ఖమ్మం నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, పిఎసిఎస్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం ధనియాకుల హనుమంతరావు, తోటకూరి శివయ్య, గ్రబు నాయక్ పిలుపునిచ్చారు.

మండలంలోని కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో శనివారం కామేపల్లి మండల స్థాయి పట్టభద్రుల సమావేశం జరిగింది. భారీగా మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల పట్టభద్రుల సమావేశంలో పాల్గొన్న మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వలన తెలంగాణ అభివృద్ధి కుంటుపడినప్పటికీ,ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్ రెడ్డి హయాంలో మహిళలకు ఫ్రీ బస్సు పథకం,200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ పథకం,రైతుబంధు,రైతు బీమా లాంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తు జిల్లాలో సాగునీరు త్రాగునీటి కోసం సీతారామ ప్రాజెక్టు ద్వారా కాలువలు చెరువులు నింపే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అభ్యర్థి విషయంలో పార్టీ తగు నిర్ణయం తీసుకున్నదని,రాంరెడ్డి కుటుంబం అంటే ఒక చెరగని ముద్ర అని,రాష్ట్ర వ్యాప్తంగా ఆ కుటుంబానికి మంచి పేరు ఉన్నదని ప్రజలలో వారికి ఉన్న మంచితనానికి రాజకీయ అనుభవాన్ని పార్టీ గుర్తించిందని. పట్టభద్రులకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని నియమించి టికెట్ ఖరారు చేసిందని. వారి తండ్రి మాజీ మంత్రి కీ.శే. రాంరెడ్డి దామోదర్ రెడ్డి, పెదనాన్న కీ.శే రాంరెడ్డి వెంకట రెడ్డి ఆశయాల మేరకు ఉన్నతమైన భావాలతో ప్రజలకు సేవ చేస్తున్నారని, ఎంతో ఉన్నతమైన చదువులు చదివి కూడా ప్రజాసేవకు అంకితమయ్యారని అన్నారు. అలాంటి వ్యక్తిని గెలిపించుకోవడం వలన ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు.2023 నవంబర్ ఒకటికి ముందు ఉత్తీర్ణులైన పట్టభద్రులు 18 ఫారం ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని,మండలంలో ప్రతి గ్రామంలో గ్రాడ్యుయేట్ లను నమోదు చేసే కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని,పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి పట్టభద్రుల ఓట్లు నమోదు చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేపల్లి, పింజరమడుగు, టేకుల తండా,సాతాని గూడెం సర్పంచులు ధరావత్ అనురాధ, భాషరెడ్డి, రెడ్యా, మాజీ ఎంపీపీ మాలోత్ సరిరామ్ నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు ఉప్పుగండ్ల వీరభద్రం ఆలోత్ శివ,సత్తి వీరబాబు, గుగులోతు రవి,కోలా వెంకటేశ్వర్లు చల్లా మల్లయ్య,కాటయ్య పుచ్చకాయల అప్పారావు మల్లెంపాటి అప్పారావు, బద్రు,గాడేపల్లి రవి, శ్రీరాములు,పాటిబండ్ల ప్రసాద్ శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, పందగ కోటి,తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే వల్ల భవిష్యత్తులో భూవివాదాలు తగ్గించవచ్చు

- **సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**

పెనుబల్లి అక్టోబర్ 24( జనం సాక్షి ): గ్రామాలలో రీ సర్వే వల్ల భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను తగ్గించేందుకు, రైతులకు వారి భూములపై స్పష్టత కల్పించేందుకు అవకాశం ఉంటుందని కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ రైతులకు వివరించారు. శనివారం పెనుబల్లి మండలం తల్లపెంట గ్రామంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభకు సబ్ కలెక్టర్ పాల్గొని రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ భూములకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలు, అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. భూముల సర్వే, భూ హద్దులు, భూ రికార్డుల స్పష్టత తదితర అంశాలపై రైతులతో చర్చించారు. రీసర్వే ప్రక్రియ ద్వారా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా పరిశీలించి, భూ హద్దులను నిర్ధారించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకతను పెంపొందించవచ్చని సబ్ కలెక్టర్ వివరించారు. రైతులు రీసర్వే బృందాలకు సహకరించి, తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో పెనుబల్లి తాసిల్దార్ వీరభద్ర నాయక్, తాళ్లపెంట గ్రామ సర్పంచ్ నారపోగు శారద, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సూరపురెడ్డి బాపిరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాళోత్ రాధాకృష్ణ, బ్రహ్మలకుంట సర్పంచ్ బాణోత్ తులశ మ్మ తదితరులు పాల్గొన్నారు.



# 22 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన శ్రీ విద్య పూర్వ విద్యార్థులు



ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్24 ( జనం సాక్షి ): ఖమ్మం పట్టణంలోని శ్రీ విద్య ఇంటర్ కాలేజీ 2002--2004 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. స్థానిక మారమ్మ తల్లి ఆలయం సమీపంలోని అనుమూల దశవంత్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి తమ కళాశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో కలిసి చదువుకున్న రోజులు, స్నేహితులతో గడిపిన క్షణాలు, పండుగ సెలవుల్లో ఆటపాటలతో గడిపిన సమయం, కళాశాలలో జరిగిన వివిధ కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. సెల్‌ఫోన్లు, ఆధునిక డిజిటల్ పరికరాలు అందుబాటులో లేని రోజుల్లో చదువుకే ప్రాధాన్యతనిస్తూ,స్నేహబంధాలకు విలువనిస్తూ గడిపిన కాలాన్ని గుర్తుచేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. కొత్త సినిమాలు విడుదలైనప్పుడు స్నేహితులంతా కలిసి సినిమాలకు వెళ్లిన సందర్భాలు, కళాశాలలో చేసిన సరదాలు, అప్పటి విద్యావిధానం, ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులకు ఉన్న గౌరవం వంటి అంశాలను పరస్పరం పంచుకున్నారు. అప్పట్లో నిర్వహించిన విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు తమలోని ప్రతిభను వెలికితీసి, మేధాశక్తిని పెంపొందించేందుకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. గురువులు అందించిన విద్యాబోధన, క్రమశిక్షణ, విలువలు తమ ప్రస్తుత జీవితానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. 2002--2004 బ్యాచ్‌కు చెందిన పలువురు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ రంగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కలుసుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని, కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు.

# నల్లమల అక్షిత కుటుంబానికి తుంబూరు దయాకర్ రెడ్డి పరామర్శ

తిరుమలాయపాలెం అక్టోబర్ 24 (జనం సాక్షి): అమెరికాలో గుండెపోటుతో మృతి చెందిన ఖమ్మం పట్టణానికి చెందిన నల్లమల అక్షిత కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మాజీ జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ బత్తుల రవికుమార్ పరామర్శించారు. అక్షిత తల్లిదండ్రులను కలిసి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా అక్షిత చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్షిత మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అక్షిత మరణం ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.



# కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందాలి

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**నూతనకల్ అక్టోబర్ 24 ( జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న రైతులు ఆరుతడి పంటలైన కూరగాయలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. శనివారం నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో రెండు ఎకరాల్లో వంగ, మునగ తోటలు సాగు చేస్తున్న బోయిండ్ల సరోజ బక్కయ్య వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు.వంగ, మునగ సాగులో లాభనష్టాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన బిందు సేద్యం పరికరాలు ఎలా పనిచేస్తున్నాయి, ఎరువులను ఏ విధంగా అందిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల సాగు చేపడుతున్న రైతు బోయిండ్ల కార్తీక్ ను కలెక్టర్ అభినందించారు. యువరైతు కార్తీక్ ఉన్నత చదువులు చదువుకొని ఒకరి దగ్గర పనిచేయడం ఇష్టం లేక తన సొంత వ్యవసాయ భూమి రెండు ఎకరాలలో వంగ మునగ తోటలను సాగుచేస్తూ ఎల్ నీనో ప్రభావాన్ని ఎదుర్కొంటూ సాగు చేస్తూ లాభాలు అర్జిస్తున్నారు.అనంతరం అలుగునూరు శివారులో సాదు రామకృష్ణారెడ్డి 14 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సందర్శించి సాగు విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి తీగల నాగయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, ఆత్మకూర్ ఎస్ తహసిల్దార్ అమిన్ సింగ్ తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారి వి. ప్రమీత,విస్తరణ అధికారులు ముత్యం రాజు, సుధాకర్‌రెడ్డి, రాము, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ భద్రాచలం, భవిష్య, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# స్పైసీ హోటల్‌పై విద్యుత్ శాఖ మౌనం ఎందుకు?

- పేదోడికి ఒక న్యాయం.. పెద్దోడికి మరో న్యాయమా?
- ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అనుమతులపై స్పష్టత ఏది?
- ఫిర్యాదులపై చర్యలు ఎక్కడ?




**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** నిబంధనలు ఉల్లంఘించిన సామాన్యులపై తక్షణమే కొరడా ఝులిపించే విద్యుత్ శాఖ అధికారులు, స్పైసీ హోటల్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఒక సామాన్యుడు తన ఇంట్లో లేదా ఫంక్షన్‌లో విద్యుత్ వినియోగానికి సంబంధించి నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించే అధికారులు, ఓ హోటల్‌పై ఆరోపణలు వచ్చినప్పుడు మాత్రం ఎందుకు స్పందించడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు.

ఈనెల అక్టోబర్ 14న బీఆర్‌ఎస్, టీఆర్‌పీ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీలో స్పైసీ హోటల్‌కు సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, వాటికి సంబంధించి అవసరమైన అనుమతులపై నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. అనుమతులు ఉన్నాయా? లేవా? నిబంధనల ప్రకారమే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారా? సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారా? అనే అంశాలపై విద్యుత్ శాఖ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అయితే, ఈ డిమాండ్లపై ఇప్పటివరకు స్పష్టమైన సమాచారం ప్రజలకు అందకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు అందాయా? అందితే వాటిపై ఎలాంటి విచారణ చేపట్టారు? నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారా? గుర్తిస్తే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఆరోపణలు నిజమో కాదో తేల్చాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే అయినప్పటికీ, ఈ వ్యవహారంపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది.

**సామాన్యుడికే చట్టాలు.. పెద్దవారికి వర్తించవా?**

ఒక సామాన్యుడు ఫంక్షన్ కోసం తాత్కాలికంగా విద్యుత్ వైరు వినియోగించినా, నిబంధనల ఉల్లంఘన జరిగితే భారీ జరిమానాలు విధించే విద్యుత్ శాఖ అధికారులు, స్పైసీ హోటల్ వ్యవహారంలో మాత్రం ఇప్పటివరకు చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇకనైనా అధికారులు మేల్కొంటారా?**

స్పైసీ హోటల్‌కు సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, అనుమతులు, విద్యుత్ భద్రతా ప్రమాణాలపై సమగ్ర తనిఖీ నిర్వహించి, నిబంధనల ప్రకారం అన్ని అంశాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఉల్లంఘనలు లేకపోతే ఆ విషయాన్ని కూడా స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా మౌనం వహించడం వల్ల విద్యుత్ శాఖపై అనవసర అనుమానాలు పెరిగే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, సామాన్యులకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయం అనే భావనకు తావులేకుండా వ్యవహరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజల ప్రశ్న ఒక్కటే.. స్పైసీ హోటల్ వ్యవహారంపై విద్యుత్ శాఖ అధికారుల విచారణ ఎక్కడ ఆగింది? అనుమతులపై స్పష్టత ఎప్పుడు ఇస్తారు? నిబంధనల ఉల్లంఘనలు ఉంటే చర్యలు ఎప్పుడు తీసుకుంటారు?.

# మునుగోడు రాజకీయాల్లో ఈఎల్వీ భాస్కర్ సెగ!

**జనం సాక్షి ప్రత్యేక కథనం । మర్రిగూడ/ గట్టుప్పల్:**మునుగోడు రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. గట్టుప్పల్ వేదికగా జరిగిన రాచకొండ దసరా ఉత్సవాలు--2026 రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించాయి. ఈఎల్వీ ఫౌండేషన్ అధినేత ఇరగదిండ్ల భాస్కర్ నిర్వహించిన కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలిరావడం, ఆయన ప్రసంగంలో సాగునీటి ప్రాజెక్టులు, రైతాంగ సమస్యలు, బీసీ ఆత్మగౌరవం ప్రధానాంశాలుగా నిలవడం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఇది కేవలం దసరా సంబరమా? లేక మునుగోడు రాజకీయాల్లో కొత్త శక్తి ఆవిర్భావానికి సంకేతమా? అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.



**జనసందోహంతో రాజకీయ లెక్కల్లో గందరగోళం?**

రాచకొండ దసరా ఉత్సవాల వేదికపై భాస్కర్ చేసిన ప్రసంగం, కార్యక్రమానికి తరలివచ్చిన జనసందోహం మునుగోడు రాజకీయాలపై చర్చను మరింత వేడెక్కించాయి. నిర్వాహకుల అంచనా ప్రకారం సుమారు 15 వేల నుంచి 20 వేల మంది వరకు హాజరైన ఈ కార్యక్రమంలో శివన్నగూడ రిజర్వాయర్ పూర్తి, రాచకొండ ఎత్తిపోతల పథకం సాధన, రైతుల సంక్షేమం, ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం వంటి అంశాలు ప్రధానంగా వినిపించాయి.

రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను కేంద్రబిందువుగా చేసుకుని భాస్కర్ ముందుకు రావడం ప్రత్యేకంగా చర్చనీయాంశమైంది. సాధారణంగా రాజకీయ సభల్లో పార్టీలు, నాయకుల చుట్టూ చర్చ తిరుగుతుంది. కానీ గట్టుప్పల్ వేదికపై సాగునీరు, రైతుల భవిష్యత్తు, ప్రాంతీయ అభివృద్ధి అంశాలను ముందుకు తెచ్చే ప్రయత్నం కనిపించింది.ఈ సభతో భాస్కర్ రాజకీయ ప్రాధాన్యం పెరిగిందా? ఆయనకు లభించిన ప్రజా స్పందన భవిష్యత్తులో ఓట్ల రాజకీయాలపై ప్రభావం చూపుతుందా? అన్న ప్రశ్నలు స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

**బీఆర్‌ఎస్‌లో కలవరం మొదలైందా?**

మునుగోడు బీఆర్‌ఎస్ రాజకీయ వర్గాల్లో ఈ కార్యక్రమంపై ఆందోళన మొదలైందని, సభకు రావాలనుకున్న కొందరు నేతలకు ఫోన్లు చేసి రావద్దని కోరినట్లు ప్రచారం జరుగుతోంది. కార్యకర్తల నుంచి ముఖ్య నాయకుల వరకు కొందరిని కార్యక్రమానికి దూరంగా ఉంచేందుకు ప్రయత్నాలు జరిగాయన్న చర్చ కూడా వినిపిస్తోంది.

ఒక కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలిరావడం ఒక్కటే రాజకీయ విజయానికి కొలమానం కాకపోయినా, ఆ జనస్పందన వెనుక ఉన్న కారణాలను ప్రధాన పార్టీలు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యంగా ప్రాంతీయ సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి ఉంటే, వాటిని రాజకీయంగా ముందుకు తెచ్చే నాయకులకు అవకాశాలు ఏర్పడవచ్చు.

**బీసీ వాదానికి బీజం.. కొత్త రాజకీయ శకానికి సంకేతమా?**

బీసీ బిడ్డగా తనను ఆశీర్వదించాలని భాస్కర్ చేసిన విజ్ఞప్తి ఈ కార్యక్రమానికి మరో రాజకీయ కోణాన్ని జోడించింది. బీసీ ఆత్మగౌరవం, ప్రజా సమస్యలు, ప్రాంతీయ అభివృద్ధి అనే అంశాలను కలిపి ఆయన తన ప్రసంగాన్ని సాగించారు.

మునుగోడు రాజకీయాల్లో కుల సమీకరణాలు, సామాజిక ప్రాతినిధ్యం, నాయకత్వ అవకాశాలు ఎప్పటికప్పుడు చర్చకు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో బీసీ వాదాన్ని ముందుకు తెస్తూ భాస్కర్ ప్రజల్లోకి వెళ్లడం భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ పరిణామాలకు దారితీస్తుందన్న ఆసక్తి నెలకొంది. అయితే బీసీ వాదం నిజమైన రాజకీయ శక్తిగా ఎదగాలంటే సభలకు వచ్చే జనసందోహం మాత్రమే సరిపోదు. గ్రామస్థాయిలో నిరంతర ప్రజాసంబంధాలు, స్థానిక సమస్యలపై పోరాటం, బలమైన నాయకత్వ బృందం, స్పష్టమైన కార్యాచరణ అవసరం.

**శివన్నగూడ నినాదమే రాజకీయ అస్త్రమా?**

భాస్కర్ ప్రసంగంలో అత్యంత బలంగా వినిపించిన అంశం శివన్నగూడ రిజర్వాయర్ పూర్తి చేయాలన్న డిమాండ్. మునుగోడు ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని, రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని కార్యరూపంలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నినాదం వెనుక కేవలం రాజకీయ ఆకాంక్ష మాత్రమే కాకుండా, రైతాంగానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యను ప్రజా చర్చలో ఉంచాలన్న ప్రయత్నం కనిపించింది.

# ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



**జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 24 (జనం సాక్షి):**ఎల్ నినో దృష్ట్యా ఏర్పడిన పరిస్థితుల వలన కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పల్లపు ఝాన్సీ కోరారు. శనివారం అడివెలతో పాటు వివిధ గ్రామాలలో జరుగుతున్న వీబీజీ రామ్‌జీ పనులను పరిశీలించారు. వనమహోత్సవంలో నాటిన మొక్కలకు జరుగుతున్న పెన్సింగ్ పనులను పరిశీలించారు. గ్రామాలలో ప్రతి ఒక్కరికి పని కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఇరుగు నాగయ్య, టీఏ యాదమ్మ, పంచాయతీ కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ చెరుకు గంగ పాల్గొన్నారు.

# సింగారంలో పిట్టల చంద్రయ్య మృతికి ఇ.ఎల్.వి భాస్కర్ నివాళి

**చౌటుప్పల్, అక్టోబర్ 24( జనం సాక్షి )** మునుగోడు మండలంలోని సింగారం గ్రామానికి చెందిన ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యుడు పిట్టల వెంకటేష్ తండ్రి పిట్టల చంద్రయ్య ఇటీవల మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఫౌండేషన్ అధినేత ఇ.ఎల్.వి.భాస్కర్ శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. చంద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సొంత ఖర్చులతో తీసుకెళ్లనున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

## విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించిన కలెక్టర్ బి.చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** పదో తరగతి పరీక్షల్లో ప్రథమ ర్యాంకులు సాధించే విద్యార్థులను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఢిల్లీ పర్యటనకు తీసుకెళ్లనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. విమాన ప్రయాణంతో పాటు ఇతర ఖర్చులు, షాపింగ్ ఖర్చులను సైతం మంత్రి భరిస్తారని, ఢిల్లీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు.శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడలో ఉన్న కోమటిరెడ్డి ప్రతీక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు, పాఠశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఏడో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారి చదువు, విద్యా పురోగతి, ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారని, చదువులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారని, తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు.అనంతరం పదో తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. రిఫ్లెక్షన్, నాన్‌రిఫ్లెక్షన్ అంశాలపై ప్రశ్నలు అడిగి, విద్యార్థులు బోర్డుపై సమాధానాలను వివరించిన తీరును పరిశీలించారు.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి**

ఎనిమిది, తొమ్మిది, పదో తరగతుల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. తక్కువ మార్కులు సాధిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రతి విద్యార్థికి నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించి మెరుగైన మార్కులు సాధించేలా బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించి వారి అభ్యసన స్థాయిని అంచనా వేశారు.

**నీటి వృథాను అరికట్టాలి**

పాఠశాలలోని మూత్రశాలలను పరిశీలించిన కలెక్టర్ నీటి కుళాయిల్లో లీకేజీలు లేకుండా చూడాలని, అవసరమైన చోట కొత్త కుళాయిలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి వృథాను అరికట్టేందుకు పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న రోజుల్లో నీటి వినియోగంపై మరింత అప్రమత్తంగా ఉండాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎక్కడా నీరు వృథా కాకుండా విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతిరోజూ ఉదయం ప్రార్థన సమయంలో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని, నీటి సంరక్షణపై తమ ఇళ్లతోపాటు పరిసర ప్రాంతాల్లోనూ అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, చదువులో వెనుకబడిన వారిని ముందుకు తీసుకువచ్చి మెరుగైన విద్యా ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ రామాచారి, ఎంఈఓ అరుంధతి, ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్, సుధారాణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ ఎడమకాలువలో మృతదేహం లభ్యం

## మిర్యాలగూడవాసిగా గుర్తింపు



**మిర్యాలగూడ, (జనంసాక్షి) :** సాగర్ ఎడమకాలువలో మృతదేహం లభించిన సంఘటన మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్సై ఉప్పు నగేష్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం నాడు మండల పరిధిలోని తాటిచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గు తండా శివారు ప్రాంతంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభించగా, అతని గురించి విచారించగా మృతుడు ఆలేటి వీరబాబు, తండ్రి లక్ష్మయ్య, వయస్సు సుమారు 48 సంవత్సరాలు, కులం మంగలి, వృత్తి బార్బర్, నివాసం ముత్తిరెడ్డికుంట, మిర్యాలగూడ పట్టణం. గా గుర్తించడం జరిగింది.మృతుడు గత కొంతకాలంగా వెరికోస్ వెయిన్స్ సమస్యతో పాటు చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని . సుమారు ఆరు సంవత్సరాల క్రితం వెరికోస్ వెయిన్స్ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ, తిరిగి అదే సమస్య పునరావృతం కావడంతో తరచూ అనారోగ్య బాధలు అనుభవిస్తూ మనస్తాపానికి గురయ్యేవాడని కుటుంబ సభ్యులు వెల్లడించారని ఆయన తెలిపారు. ఈ రోజు ఉదయం సుమారు 9:00 గంటలకు మృతుడు తన పని నిమిత్తం సింధు సెలూన్‌కు వెళ్లగా, మధ్యాహ్నం ఇంటికి తిరిగి రాలేదు. అనంతరం నాగార్జునసాగర్ ఎడమ కాలువలో ఒక మృతదేహం కొట్టుకువస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానికుల సహాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఆలేటి వీరబాబుదిగా గుర్తించారు. కుటుంబ సభ్యుల వాంగ్మూలం ప్రకారం, మృతుడు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి మరణంపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుని భార్య ఇచ్చిన ధరఖాస్తు పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన్నట్లు ఆయన తెలిపారు.



# జాజిరెడ్డిగూడెం గ్రామంలో డప్పుల పంపిణీ

**జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి) :** సమాజంలోని కళాకారులను, సంప్రదాయ వృత్తులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని బీఆర్ఎస్ జాజిరెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షుడు గుండగాని సోమేష్ గౌడ్ అన్నారు. శనివారం జాజిరెడ్డిగూడెం గ్రామంలో దాత మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్ అందించిన డప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై నిర్వహించారు. ?ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్ గౌడ్ మాట్లాడుతూ... డప్పు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. మన గ్రామాల్లోని కళాకారులను గౌరవించడం, వారి కళను కాపాడుకోవడం సమాజంలో ప్రతీ ఒక్కరి బాధ్యత అని చెప్పారు. గ్రామంలోని కళాకారులకు తోడ్పాటుగా నిలిచేందుకు డప్పులను ఉచితంగా అందించిన దాత మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలకు, కళాకారులకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మొరిశెట్టి ఉపేందర్, సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు వల్లపు గంగయ్య, బొడ్డు రామలింగయ్య, తాడూరి రామకోటి, మెండే సురేష్, వెంకన్న, సోమిరెడ్డి, పొన్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, కుంభం నాగరాజు, నర్సింగ వెంకన్న, పెద్ది శ్రీను, వార్డు సభ్యులు సురేష్, సందీప్, బీ ఆర్ ఎస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# కూలీలకు ఉపాధి పల్లెల పురోగతి

**నూతనకల్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ఉపాధి అస్త్రాన్ని అందించేందుకు సర్కారు సన్నద్ధమవుతుంది దానిలో భాగంగా మండల పరిధిలో వివిధ గ్రామాలలో జరుగుతుండగా, మాచనపల్లి,నూతనకల్ లో మండల ప్రత్యేక అధికారి ఎం ఏ భారతి మాట్లాడుతూ నేటి నుంచి అమల్లోకి వచ్చిన ఉపాధి హామీ పథకంతో గ్రామీణులు జీవనో పాధి పొందాలని తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో ఎంపీడీవో సునీత,ఎంపీఓ హరి సింగ్,ఏపిఓ,టిఏ, తదితరులు పాల్గొన్నారు.

# సాయి మందిరం అధ్యక్షుడు జన్మదిన వేడుకలు



**హాలియా (జనంసాక్షి) :** సాయి మందిరం అధ్యక్షుడు తేలపోలు శేఖర్ జన్మదిన వేడుకలు హాలియాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిటి పోలు యాదగిరి, ఐదో వార్డ్ కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మిట్టపల్లి వాసులు, నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య సంగం ఉపాధ్యక్షులు చీదళ్ళ లింగయ్య, హాలియా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాసు, సక్రు నాయక్, మిట్టపల్లి శివకుమార్, వీరమళ్ళ కృష్ణయ్య, ఊర వేణు, ఆర్య పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మంచుకొండ ప్రభాకర్, కొండూరు గణేషు, కొండూరు వెంకటేశ్వర్లు, బచ్చు వెంకన్న, మంచుకొండ వెంకటేశ్వర్లు, శ్రీను, నాంపల్లి రవి, సముద్రాల అరవిందు, నాగరాజు ఉదయ్ పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి మున్నూరుకాపు సంఘం అండ

## మృతురాలి కుటుంబానికి దశదిన ఖర్చుల నిమిత్తం రూ.8,500 ఆర్థిక సాయం



**అశ్వాపురం అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ మున్నూరుకాపు సంఘం సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. మొండికుంట గ్రామానికి చెందిన జంగిలి సుగుణమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులకు దశదిన కార్యక్రమ ఖర్చుల నిమిత్తం రూ. 8,500 ఆర్థిక సాయాన్ని సంఘం సభ్యులు అందజేశారు.కుటుంబ సభ్యులకు కష్టకాలంలో ఆర్థికంగా తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు తెలిపారు. సమాజంలో పరస్పర సహకారం, సేవాభావం పెంపొందించేందుకు సంఘం సభ్యులు చేస్తున్న ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, యువజన సంఘం అధ్యక్షుడు పర్వత నరేష్, సభ్యులు తోట నర్సయ్య, బత్తిన ప్రసాద్, తోట వేణు, తులసి అశోక్, జెట్టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా పోలీసు శాఖ

## నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్



**నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ భరోసా ఇచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆయన అమరుడైన ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 1994లో అడవిదేవులపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో నక్సలైట్ల దాడిలో అమరులైన ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులను నల్లగొండలోని 2 టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వారి నివాసానికి వెళ్లి ఎస్పీ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. పోలీసు శాఖ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులైన పోలీసు వీరుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విధి నిర్వహణలో సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ 15 మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారని గుర్తుచేశారు. అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు భద్రత కల్పించగలుగుతున్నారని అన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరామిరెడ్డి, ఎస్బీ సీఐ నాగరాజు, 2 టౌన్ సీఐ ఆదిరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ సంతోష్, 2 టౌన్ ఎస్ఐ సైదాబాబు, అమరవీరుడు ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

## గోపి యాదవ్‌కు తుంబూరు దయాకర్ రెడ్డి అభినందనలు



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తూ, యువత సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సూచించారు. పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన రెబ్బగొండ్ల గోపి యాదవ్ శనివారం దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గోపి యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆశయాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ యువతకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిరణ్, ఎదులాపురం మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ నవీన్, కౌన్సిలర్ నవీన్, మున్సిపాలిటీ బీసీ సెల్ అధ్యక్షుడు వెంపటి రవి, 29వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు మిర్యాల నరుణ్ తేజ్, నాయకులు అక్కినేపల్లి దేవయ్య చారి, ఎన్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలి



**సూర్యాపేట (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి పట్టభద్రుడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పాత మున్సిపల్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించడంతో పాటు, నమోదు ప్రక్రియలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఇలాంటి కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం వరంగల్ నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు నాగుల వాసు, గుణగంటి హేమసతీష్,నాయకులు కోడి శివ, నిమ్మల లవన్, వల్లల శేఖర్, రామసాని శ్రీనివాస్ నాయుడు, జిడిమెట్ల రాంబాబు, లింగయ్య, శ్రీనివాస్ నాయుడు, సాజిద్ పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు పొత్తులు గుర్తుకొస్తున్నాయి

## సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు దంతాల బాలరాజు



**తిరుమలాయపాలెం అక్టోబర్ 24( జనంసాక్షి) :** గ్రాడ్యుయేట్ ఎన్నికల సమయంలో సీపీఐతో పొత్తుల కోసం ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల అనంతరం సీపీఐ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో వివక్ష చూపుతోందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు దంతాల బాలరాజు ఆరోపించారు. శనివారం తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్న వారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే ధోరణి కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో సీపీఐతో పొత్తులు, మిత్రధర్మం గుర్తుకొచ్చే కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల అనంతరం సీపీఐ కార్యకర్తల సంక్షేమం పట్టడం లేదని విమర్శించారు. మిత్రపక్షాల కార్యకర్తల పట్ల వివక్ష చూపకుండా, అర్హులైన పేదలందరికీ పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా అందజేయాలని దంతాల బాలరాజు డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఇళ్లులేని పేద కుటుంబాలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, నిరుపేద కార్మికులు అనేక మంది ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మిత్రపక్షాల కార్యకర్తలను విస్మరించడం, వారి సమస్యలను పట్టించుకోకపోవడం రాజకీయ నైతికతకు విరుద్ధమని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో చోటుచేసుకుంటున్న అన్యాయంపై సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో ప్రజలను సమీకరించి పోరాటం చేపడతామని దంతాల బాలరాజు హెచ్చరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే సమీక్ష నిర్వహించి, పార్టీ వివక్షకు తావులేకుండా అర్హత ఆధారంగా ఇళ్లను కేటాయించడంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆయన కోరారు.

# అక్టోబర్ 26న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహా ధర్నా

## రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య పిలుపు



**మర్రిగూడ అక్టోబర్ 24 జనం సాక్షి)**

హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద అక్టోబర్ 26న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహా ధర్నాను జయప్రదం చేయాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య రాష్ట్రంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, పీఆర్సీ ప్రయోజనాలు వర్తింపజేయడం తదితర డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏళ్ల తరబడి వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సేవలందిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 26న ఇందిరా పార్కు వద్ద జరిగే మహా ధర్నాకు రాష్ట్రంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరి యాదయ్య కోరారు

# డీటీఎఫ్‌కు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం




**సూర్యాపేట (జనంసాక్షి) :** డిటిఎఫ్ కు సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో సభ్యత్వం లభించిన సందర్భంగా ఆ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేపాక లింగయ్య, జిల్లా అధ్యక్షులు షేక్ ఉమర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్వాయి బిక్షం మాట్లాడుతూ లౌకిక, ప్రజాస్వామిక, సామ్యవాద సైద్ధాంతిక పునాదులు గల బలమైన సంఘం డిటిఎఫ్ కు రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో సభ్యత్వం కల్పించిందని తెలిపారు. డిటిఎఫ్ కు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ లో సభ్యత్వం కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గానికి, విద్యాశాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసకుపోవడంలో ఇది చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు బి.దేవేందర్, ఏ.రాంసింగ్, జిల్లా కార్యదర్శులు ఆర్.నాగయ్య, ఫజల్ ఆబ్ ఖాన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మన్నూరు నాగన్న, నకిరేకంటి వెంకన్న, సుజాత, బి.క్రాంతి కుమార్,సీనియర్ సభ్యులు కె.యోగానంద్, చర్లపల్లి వెంకటయ్య, డి.ప్రేమ్ కుమార్,ఇరుగు యాదగిరి, దామల్ల వెంకన్న, ఎన్.పరమేష్, వై.చంద్రశేఖర్ రెడ్డి, ఎస్.విజయ్, జలగం అబ్రహం,వీరమల్ల సైదులు, పి.నరసింహాచారి, కొరివి మధు,మెంతబోయిన సైదులు, ఏ.సుధీర్, వై.వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కాంగ్రెస్ వైఫల్యం

## యూత్ డిక్లరేషన్ కాస్తా యూజ్‌లెస్ డిక్లరేషన్‌గా మారింది : బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విమర్శ

**భద్రాచలం అక్టోబరు 24 (జనంసాక్షి) :** రాష్ట్రంలో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిరుద్యోగులను నిరాశకు గురిచేస్తోందని మండిపడ్డారు. శుక్రవారం భద్రాచలంలోని హరిత హోటల్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.



**ఫీజు బకాయిలతో విద్యార్థులకు ఇబ్బందులు**

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల కాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాకేశ్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించేందుకు ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**అమలుకు నోచుకోని యువతకు ఇచ్చిన హామీలు**

ఏటా రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై యువత పెట్టుకున్న ఆశలు నిరాశగా మారాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 లక్షల మంది స్వయం ఉపాధి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, దాని అమలుపై స్పష్టత లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా అర్హులకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు.

**పరిశ్రమలకు ప్రోత్సాహం.. యువతకు ఉపాధి కల్పించాలి**

హైడ్రా, మూసీ ప్రక్షాళన చర్యల కారణంగా రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు ప్రభావితమవుతున్నాయని రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహించి యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీ-హబ్, వీ-హబ్, టాస్క్, టీఎస్-ఐపాస్ వంటి కార్యక్రమాల ద్వారా పరిశ్రమలు, ఐటీ రంగాలకు ప్రోత్సాహం లభించిందని గుర్తుచేశారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

**పట్టభద్రులు ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలి**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఫారం-18 ద్వారా ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని రాకేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, కోటగిరి ప్రబోధ్‌కుమార్, దొడ్డితాతారావు తదితరులు పాల్గొన్నారు.



# భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

## భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

## దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు

**భద్రాచలం అక్టోబరు 24 (జనంసాక్షి) :** భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆలయ ఈవో కె. దామోదర్‌రావు తెలిపారు. శనివారం ఆయన ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. పనులు కొనసాగుతున్న సమయంలో ఆలయ పవిత్రత, సంప్రదాయాలకు భంగం కలగకుండా, భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రాద్రి రామాలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనార్థం వస్తుంటారని, పర్వదినాలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతోపాటు, ఆలయ పరిసరాల్లో అవసరమైన వసతులను మెరుగుపరచేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఈవో తెలిపారు. భక్తులకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని స్పష్టం చేశారు.




# పోక్సో చట్టంపై ప్రతి బాలిక అవగాహన కలిగి ఉండాలి

## లైంగిక వేధింపులపై మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి : న్యాయమూర్తి వి. శివనాయక్

**భద్రాచలం అక్టోబర్ 24 (జనంసాక్షి)**

బాలికలు, చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి. శివనాయక్ హెచ్చరించారు. బాలికలు వేధింపులకు గురైనప్పుడు భయంతో మౌనంగా ఉండకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. భద్రాచలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. చిన్నారులు, బాలికలను లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షించేందుకు 2012లో పోక్సో చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టం ప్రకారం బాలలపై లైంగిక నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైతే నేర తీవ్రతను బట్టి కఠిన శిక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇలాంటి కేసుల సత్వర విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన అవసరం**

బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడంతోపాటు మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించాలని శివనాయక్ సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, అనుచితంగా తాకినా, బెదిరింపులకు గురిచేసినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని అన్నారు.

పరిచయస్తులు, బంధువులు అయినప్పటికీ ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే భయపడకుండా విషయాన్ని వెల్లడించాలని స్పష్టం చేశారు. బాలలపై జరిగే లైంగిక నేరాలను దాచిపెట్టడం వల్ల నేరస్థులకు మరింత అవకాశం కల్పించినట్లవుతుందని పేర్కొన్నారు. బాధిత బాలికలు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడకూడదని, వారి రక్షణకు చట్టపరమైన చర్యలు అందుబాటులో ఉన్నాయని భరోసా ఇచ్చారు. బాలికలు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి సమస్య ఎదురైనా తగిన సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్

## పోలీసుల విధులు, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

**చిలుకూరు, అక్టోబర్ 24 (జనంసాక్షి)**

శనివారం మండల కేంద్రములోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ అమరవీరుల దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు ఎస్ఐ మోహన్ బాబు విద్యార్థులకు పోలీసుశాఖ విధులు, నేర పరిశోధన,నేరాల ఛేదనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, పోలీసు విధివిధానాలు, నేరాల పరిశోధన, నేరస్థులను గుర్తించే పద్ధతులు,సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత, మహిళలు, విద్యార్థులు, బాలల రక్షణలో పోలీసు శాఖ పాత్ర గురించి వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసులను త్వరితగతిన ఛేదించడంలో పోలీసులు అనుసరిస్తున్న విధానాలను విద్యార్థులకు తెలియజేశారు. అదేవిధంగా పోలీసు కమ్యూనికేషన్ వ్యవస్థ, ఫింగర్‌ప్రింట్ పరికరాల పనితీరు, నేరస్థుల డేటాబేస్ నిర్వహణ, నేర పరిశోధనలో వాటి ఉపయోగాల గురించి వివరించారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

**పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తించాలి**

ప్రజల ధన, మాన, ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ, అవసరమైన సందర్భాల్లో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎస్ఐ సూచించారు. దేశం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించాలని, పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పోలీసుల విధులు, త్యాగాలు, ప్రజల భద్రత కోసం వారు చేస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో 15 కుటుంబాలు చేరిక



**కామేపల్లి,అక్టోబర్ 24 (జనంసాక్షి) :** మండలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గ పరిధిలోని టేకులపల్లి మండలం దాస్ తండా హరిప్రియ నాయక్ స్వగృహంలో శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 15 కుటుంబాలు రాజీనామా చేసి ఆ పార్టీని వదిలి బీఆర్ఎస్‌లో ఆ మండల మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య ఆధ్వర్యంలో చేరారు. వారికి పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలం బిఆర్ఎస్ పార్టీదే అని ప్రజలంతా కెసిఆర్ బిఆర్ఎస్ పాలన వైపు చూస్తున్నారని అన్నారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన వెన్ను హరికృష్ణ, గుబెనపలి జంగం, బానోతు అఖిల్, మాలోత్ మంజి, కెలోత్ రాజేష్, పొందేం వీరయ్య, అరేం బసవయ్య, అరేం రాంబాబు తదితరులు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్, లక్కినేని సురేందర్రావు, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు, భూక్యా దళ్ సింగ్ నాయక్, రాంపురం సర్పంచ్ బర్మావత్ శివకృష్ణ, బానోతు నరేష్ , మహిళా నాయకురాలు ఆమేడ రేణుక, భానోత్ రామా నాయక్, భూక్యా లాలు, మాలోత్ పుల్ సింగ్, నాగభూషణం ,కామేపల్లి మండల నాయకులు అంతోటి అచ్చయ్య, మూడ్ కృష్ణ ప్రసాద్, మల్లంపాటి శ్రీనివాస్, సామా మోహన్ రెడ్డి, కాటాల రాంబాబు, ఉద్యమకారులు దేవిలాల్, ఎస్.కే. నాగుల్ మీరా, గుంపెనపల్లి అనంత రాములు, ఈసం రామ్మూర్తి తదితరులు హాజరయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు పార్టీ శ్రేణులతో ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# సర్పంచ్‌పై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

## మంత్రి పొంగులేటి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి ఆశీస్సులతో ప్రజాసేవకు అంకితమయ్యా

## హైదర్ సాయిపేట సర్పంచ్ బానోత్ సిమ్లా నాయక్



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** గ్రామ ప్రజల ఆశీస్సులతో ఏకగ్రీవంగా గెలుపొందిన హైదర్ సాయిపేట సర్పంచ్ బానోత్ సిమ్లా నాయక్‌పై కొందరు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాజకీయ దురుద్దేశంతో తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి ఆశీస్సులతో సర్పంచ్‌గా ఎన్నికైన తాను, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదాలను తనకు ఆపాదిస్తూ సర్పంచ్‌ను రాజకీయ వివాదాల్లోకి లాగడం సమంజసం కాదని సిమ్లా నాయక్ అన్నారు. వ్యక్తిగత కుటుంబ తగాదాలకు రాజకీయ రంగు పులిమి తనపై ఆరోపణలు చేయడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న గుగులోతు రాంబాబు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సిమ్లా నాయక్ ఆరోపించారు. ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల గ్రామంలో అనవసరమైన ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు వాస్తవాలను గమనించాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించవద్దని కోరారు.



# పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

## మైనర్లపై లైంగిక నేరాల నివారణకు అవగాహన అవసరం

**దమ్మపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** దమ్మపేట మండల న్యాయ సేవ అధికార కమిటీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులపై లైంగిక నేరాల నివారణ,బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టంలోని నిబంధనలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బందికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో దమ్మపేట మండల మేజిస్ట్రేట్,మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ),పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, దమ్మపేట,అశ్వారావుపేట ఎస్ఐలు, న్యాయవాదులు,పాఠశాల సిబ్బంది,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. బాలల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని,చిన్నారులపై జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఇటువంటి ఘటనలు ఎదురైనప్పుడు చట్టపరమైన చర్యల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని సదస్సులో అవగాహన కల్పించారు. బాలల హక్కులను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,విద్యాసంస్థల్లో పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, పోలీసు,న్యాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా పోక్సో చట్టంపై అవగాహన పెంపొందించడంతో పాటు బాలల రక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

# సరదా కోసం బైక్ స్టంట్లు చేస్తే చర్యలు తప్పవు

**ప్రమాదకర విన్యాసాలపై పోలీసుల నిఘా • నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు : సీఐ ముష్క రాజు**



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** సరదా కోసం రోడ్లపై ప్రమాదకర బైక్ స్టంట్లకు పాల్పడుతూ ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే యువతపై పోలీసులు కఠినంగా వ్యవహరించనున్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం రూరల్ పరిధిలో ఇలాంటి విన్యాసాలపై నిఘా పెంచినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు. ఈ క్రమంలో వెంకటగిరి గ్రామానికి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థి ఐతగాని అజయ్‌కుమార్ (20)పై శనివారం కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. రోడ్లు ప్రజలందరి రాకపోకలకు ఉద్దేశించినవని, వాటిపై ప్రమాదకర విన్యాసాలు చేస్తూ వాహనదారులు, పాదచారుల భద్రతకు ముప్పు కలిగించడం తగదని సీఐ పేర్కొన్నారు. బైక్ స్టంట్లపై నిఘా విభాగంతో పాటు పోలీస్ శాఖలోని వివిధ విభాగాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాయని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రమాదకరంగా బైక్ విన్యాసాలు చేస్తూ పట్టుబడితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఉత్సాహం, సరదా పేరుతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, తమ భద్రతతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలనూ దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, బైక్ స్టంట్లను ప్రోత్సహించడంతో పాటు రహదారులను విన్యాసాలకు వేదికలుగా మార్చే చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని సీఐ ముష్క రాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది ఎస్సై రాయుడు హెడ్ కానిస్టేబుల్ మధు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

## ఏదులాపురం కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వెంపటి సురేష్



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ఏదులాపురం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆ పార్టీ నూతన ఉపాధ్యక్షుడు వెంపటి సురేష్ అన్నారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, కార్యకర్తలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన వెంపటి సురేష్ శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వెంపటి సురేష్ మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో, ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజల సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు వెంపటి రవి, గణపరాపు వీరన్న, అశోక్ నాయక్, రాంమోహన్ రెడ్డి, కందుకూరి వెంకటనారాయణ, కడవ నవీన్, గుర్రం రాకేష్ రెడ్డి, రంజిత్ రెడ్డి, బోయిన సాయి పాల్గొన్నారు.